# నస్పూర్ ప్రజలు బీఆర్ఎస్‌నే గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు

- ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు
- నస్పూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బైక్ ర్యాలీ
- హాజరైన ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్

సీసీసీ నస్పూర్, నవంబర్ 28: నస్పూర్ పట్టణంలో నివసిస్తున్న సింగరేణి కార్మికులు, కార్మికేతర కుటుంబాలు బీఆర్ఎస్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. ఎన్నికల ప్రచారం ముగింపు రోజైనా మంగళవారం నస్పూర్ మున్సిపాలిటీలో భారీ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియానికి ఈ ప్రాంత సింగరేణి కార్మికులు, కార్మికేతరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు, నియోజకవర్గం ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుతో కలిసి మోటర్ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ప్రగతి స్టేడియంలో నుంచి ప్రారంభమైనా ర్యాలీ శ్రీరాంపూర్‌కాలనీ, ఆర్‌కే–6గుడిసెలు, కొత్తరోడ్ నుంచి కృష్ణాకాలనీ మీదుగా సీసీసీ టౌన్‌షిప్ వద్దకు చేరుకున్నది అక్కడి నుంచి నాగార్జునకాలనీ మీదుగా గోదావరి కాలనీ షిర్కె చౌరస్తా నుంచి నస్పూర్‌కాలనీ మీదుగా జాతీయ రహదారికి చేరుకుని అక్కడి నుంచి మంచిర్యాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు అనేక హక్కులు కల్పించారని వివరించారు. కొత్త మున్సిపాలిటీగా ఏర్పడిన నస్పూర్‌కు కోట్లాది రూపాయాల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సింగరేణి స్థలాల్లో ఇండ్లు కట్టుకుని నివసిస్తున్న ప్రజలకు ఇళ్ల పట్టాలను ఇప్పించి వారి చిరకాల కోరికను నెరవేర్చినట్లు తెలిపారు. ఓ వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ, ఇలా ప్రజలకు సేవలందించిన బీఆర్ఎస్ కారు గుర్తుకు ప్రజలంతా ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. బీఆర్ఎస్ గెలిస్తేనే మంచిర్యాల నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని, పొరపాటును కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరు గు పవన్, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు డీకొండ అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్ రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు పెట్టం లక్ష్మణ్, వెంగల కుమారస్వామి, నాయకులు పల్లె భూమేశ్, మల్లెత్తుల రాజేంద్రపాణి, వేల్పుల రాజేశ్, గర్శె రామస్వామి, పానుగంటి సత్తయ్య, గర్శె భీమయ్య, అన్ని గనుల పిట్ కార్యదర్శులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియానికి తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, సింగరేణి కార్మికులు

# బీఆర్ఎస్‌లో చేరిన జన్నారం సర్పంచ్



జన్నారం సర్పంచ్ గంగాధర్‌గౌడ్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్



జన్నారం : ప్రచారం చేస్తున్న నాయకులు

జన్నారం, నవంబర్ 28 : జన్నారం మండల కేంద్రంలో వ్యాపార దుకాణాలకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని వ్యాపారులను జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, నాయకులు అభ్యర్థించారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి జన్నారం సర్పంచ్ బూసవేణి గంగాధర్‌గౌడ్‌తో పాటుగా పలువురు ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి జాన్సన్ నాయక్ ఆహ్వానించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, జిల్లా అధికారప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, సర్పంచ్ జక్కు భూమేశ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తోకల సురేశ్, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, లెక్కల మల్లయ్య తదితరులున్నారు.

## సౌత్‌జోన్ బాడీబిల్డింగ్ పోటీలకు మిమ్స్ విద్యార్థి




సౌత్‌జోన్ బాడీబిల్డింగ్ పోటీలకు ఎంపికైన నితీష్‌తో కళాశాల యాజమాన్యం

మంచిర్యాల అర్బన్, నవంబర్ 28 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ జిల్లాల బాడీ బిల్డింగ్ ఎంపిక పోటీల్లో మిమ్స్ డిగ్రీ కళాశాల బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థి కే నితీష్ 60 కిలోల విభాగంలో ప్రతిభ కనబర్చి సౌత్‌జోన్ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికైనట్లు మంగళ వారం మిమ్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీ ఉపేందర్ రెడ్డి వెల్లడించారు. నితీష్ డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో కేరళలోని కాలికిట్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో కేయూ తరపున పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని కళాశాల కరస్పాండెంటు శ్రీనివాస రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు, డైరెక్టర్ విజయ్ కుమార్, పీడీ నూనె శ్రీనివాస్‌తో పాటు కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

## చెన్నూర్‌లో ఘనంగా జ్యోతిబాపూలే వర్ధంతి



మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్, నవంబర్ 28: చెన్నూర్ పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమాజానికి జ్యోతిబా పూలే చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, జడల మల్లేశ్, నెన్నెల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సెక్టర్ అధికారి బద్రీనాథ్ స్వామి

కోటపల్లి, నవంబర్ 28 : కోటపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాలను సెక్టర్ అధికారి బద్రీనాథ్ స్వామి సందర్శించారు. పోలింగ్ కేంద్రాలలోని సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికల విధులకు వచ్చే సిబ్బందికి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు స్వామి వివరించారు. ఫర్నిచర్, లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాలని బీఎల్వోలు, పంచాయతీ సిబ్బందికి సూచించారు.

### వేమనపల్లి మండలంలో..



నీల్వాయిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

వేమనపల్లి, నవంబర్ 28 : మండలంలోని నీల్వాయి, కేతనపల్లి, కల్మలపేట, మామడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో, సెక్టార్ అధికారి శ్రీపతి బాపురావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు అశోక్, జాఫర్‌అలీ ఉన్నారు.

### కాసిపేట మండలంలో..



కాసిపేట : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎంఏ అలీం

కాసిపేట, నవంబర్ 28 : కాసిపేట మండలంలోని కాసిపేట, ముత్యంపల్లి, రేగులగూడ పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. మొత్తం 11 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకొని, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులున్నారు.

## మద్యం పట్టివేత

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 28: బెల్లంపల్లి పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో సోమవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా రాంనగర్ కు చెందిన సోగాల రాజేశం, కంది మల్లేశ్ వద్ద నుంచి 56 వేల రూపాయల విలువైన మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. మద్యం బాటిళ్లను కాటన్ బాక్సుల్లో పెట్టుకొని ఇంటికి తీసుకువెళ్తుండగా పట్టుకుని విచారించగా కొన్ని నెలలుగా తాము ఇంట్లో బెల్ట్‌షాపును నడుపుతున్నట్లు తెలిపారన్నారు. పంచనామా నిర్వహించి వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు.

## పురుగుల మందు తాగి ఆత్మహత్య

దండేపల్లి, నవంబర్28: దండేపల్లి మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన అడప ప్రశాంత్(33) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.దండేపల్లి ఎస్ఐ ప్రసాద్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...ప్రశాంత్‌కు 13సంవత్సరాల క్రితం వివాహమై విడాకులైంది. ఇటీవల మధ్య పంట నష్టం రావడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 20న రాత్రి 7గంటలకు గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద పురుగుల మందు తాగాడు. అనంతరం బంధువులకు సమాచారం అందించాడు. అక్కడికి వెళ్లే సరికి అపస్మారక స్థితిలో ఉన్నాడు. చికిత్స నిమిత్తం సమీపంలోని మేదరిపేట దవాఖానకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.